
చీఫ్ ఎడిటర్: బత్తుల గణేష్
తెలుగు
# సంచలనం
ప్రతి అక్షరం – ప్రజల పక్షం
జాతీయ వార్త పత్రిక
www.sanchalanamnews.in epaper.sanchalanamnews.in

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 7 | పేజీలు : 8 | బుధవారం 17 జూన్ 2026 | వెల : 3/-

Circulated by Hyderabad, Nalgonda, Khammam, Mahaboobnagar, Rangareddy, Medhak, Karimnagar, Adhilabad, Nizamabad, Warangal, Vijayawada, Tirupathi

## మమత వర్గంతో చర్చించాకే

- టీఎంసీ రెబల్ ఎంపీల విలీనంపై స్పీకర్ నిర్ణయం!
- తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ముదిరిన సంక్షోభం
- తాము ఎన్‌సీపీఐ పార్టీలో విలీనమైనట్లు ప్రకటించిన టీఎంసీ రెబల్ ఎంపీలు
- ఈ విషయంపై త్వరలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకునే ఛాన్స్



## తెలంగాణలో ఏసీబీ మరో రైడ్

- బెడ్ కింద భారీగా నోట్ల కట్టలు
- ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి నివాసంలో ఏసీబీ సోదాలు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- నరహరి నివాసం, కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- 11 ప్రాంతాల్లో తనిఖీలు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా సమాచారంతో చేపట్టిన సోదాల్లో కళ్లు చెదిరే స్థాయిలో అక్రమాస్తులు బయటపడ్డాయి. ఏకంగా రూ.1.54 కోట్లు, కిలో బంగారం భారీగా స్థిరచరాస్తుల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మధ్య కాలంలో ఏసీబీ దాడుల్లో ఇంట్లో అత్యధికంగా నగదు పట్టుబడిన కేసు ఇదేనని అధికారులు చెబుతున్నారు. అక్రమంగా - మిగతా3లో



## ఆధార్?ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు
- ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే ఉపయోగించాలి
- పౌరసత్వ రుజువుగా వాడకూడదంటూ పిటిషన్

## సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి



- వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యత అప్పగించాలని ఆదేశం
- ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలి

హైదరాబాద్

విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యచరణ అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్ సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. బోనస్ వచ్చే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలని అన్నారు. రామగుండం కర్మాగారంలో ఉత్పత్తయ్యే ఎరువులు అత్యధికంగా - మిగతా3లో



## నీట్ రీ-ఎగ్జామ్- పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు

- నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఆన్‌లైన్ ప్రచారాలను నమ్మవద్దు
- అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలి
- నీట్ రీ ఎగ్జామ్ వేళ పలు సూచనలు చేసిన ఎన్‌టీఏ
- అందుబాటులో ఆన్‌లైన్ పోర్టల్

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

- ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ హాజరు
- హర్మూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్
- రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి




## హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు



- రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సమంజసం కాదు
- రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని వెల్లడి
- కేంద్రానికి రేవంత్, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా

హైదరాబాద్

గతంలో మెట్రో ఫేజ్–1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకారమవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విమర్శల నేపథ్యంలో ఢిల్లీలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ కావున, కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని, అనాలోచితంగా, దుందుడుకుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని హితువు కిషన్ రెడ్డి పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తాము రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా - మిగతా3లో



## జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్

- ప్రధాన్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందే: ఖర్గే
- టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం కాదు
- కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన మంత్రిని తొలగించండి
- మోదీ ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు

## తెలంగాణకు ఊపిరితిత్తులు ఈ రెండు జిల్లాలే

- ఈ జిల్లాలో ఒక శాతమూ అడవుల్లేవ్?!
- రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో అసమానతలు
- 0.15 శాతం అడవులను కలిగి ఉన్న కరీంనగర్
- హైదరాబాద్‌లో అటవీ సంపద ఆందోళన కలిగించడానికి కారణమేంటంటే?




హైదరాబాద్

అడవులతోనే మానవాళికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎన్నో జబ్బులకు ఔషధాలను అటవీ సంపద అందిస్తుంది. అంతేనా? పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందిస్తుంది. వన్యప్రాణులకైతే అడవే ఆధారం. అలాంటిది రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో భారీగా అసమానతలు కనిపిస్తున్నాయి. ములుగు జిల్లా అడుగడుగునా పచ్చదనంతో కళకళలాడుతోంది. కొత్తగూడెంలో భారీ విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ప్రస్తుతం ఈ రెండు జిల్లాలే 'తెలంగాణకు ఊపిరితిత్తులు' గా మారాయి. కానీ గద్వాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి జిల్లాల్లో మాత్రం పచ్చదనం కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. రాష్ట్రం భౌగోళిక విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 24.05 ఉందని అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన తాజా నివేదికలో తెలిపింది. భూభాగం అటవీ ప్రాంతంలో 71.82 శాతం విస్తీర్ణంలో ములుగు జిల్లా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60.95 శాతం అడవులు ఉన్నాయి. నది పరీవాహక ప్రాంతంలో, రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్ కర్నూల్ - మిగతా3లో

సంచలనం
బుధవారం
17 జూన్ 2026

# మమత వర్గంతో చర్చించాకే



టీఎంసీ పార్టీ రెబల్ ఎంపీలు తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో (ఎన్‌సీపీఐ) విలీనమయ్యామని, తమకు లోక్‌సభలో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని స్పీకర్ ఓం బిర్లాను కోరిన నేపథ్యంలో ఆయన నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఎంపీల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఈ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి. కాగా, టీఎంసీ లోక్‌సభ సభ్యుల బృందంలో అధికారికంగా చీలిక ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యామని ఇటీవలే తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు ప్రకటించారు. తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. తమకు తృణమూల్ మొత్తం ఎంపీల్లో 2/3వంతుకు మించి మెజారిటీ ఉందన్నారు. అందుకే ముందడుగు వేస్తున్నామని, ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏతో కలిసి దేశం కోసం పని చేస్తామని వివరించారు. ఈ పరిణామంపై టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ స్పందించారు. ఈ చర్యను తప్పుదోవ పట్టించేది, అప్రజాస్వామికమని మండిపడ్డారు. టీఎంసీ పార్టీ పూర్తిగా మమతా బెనర్జీ నాయకత్వంలోనే ఉందని స్పష్టం చేశారు. పార్లమెంటరీ స్థాయిలో అసలు ఉనికి లేని పార్టీలో టీఎంసీ రెబల్ ఎంపీలు ఎలా విలీనం అవుతారు? అని ప్రశ్నించారు. పదవుల కోసం రెబల్ ఎంపీలు తమలో తాము కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు.

**'మమతదే టీఎంసీ పార్టీ'**

"నిజమైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మమతా బెనర్జీదే. టీఎంసీ మమతదేనని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నాం. 20 మంది తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు స్పీకర్‌కు ఇచ్చిన లేఖ తప్పుదోవ పట్టించేలా ఉంది. తిరుగుబాటు ఎంపీల బృందం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోంది. ఇప్పటికే వారిలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. ఎవరు మంత్రి కావాలనే విషయంలో ఆ ద్రోహుల (తిరుగుబాటు టీఎంసీ ఎంపీలనుద్దేశించి) మధ్య వివాదం నెలకొంది. రెబల్ ఎంపీలు విలీనం అయిన పార్టీ(నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా)కి పార్లమెంట్‌లో ఎలాంటి ప్రాతినిధ్యం లేదు, అది గుర్తింపు లేని, రిజిస్టర్ కాని పార్టీ. దానికి ఎలాంటి ఉనికి లేదు. ఆ పార్టీలో తిరుగుబాటు టీఎంసీ ఎంపీల విలీనం ప్రజాస్వామ్యబద్ధం కాదు. " అని కీర్తి ఆజాద్ తెలిపారు.

**వార్తల్లో నిలిచిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా**

ఏమాత్రం పేరు ప్రఖ్యాతులు లేని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. అందుకు ప్రధాన కారణం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది తిరుగుబాటు ఎంపీలు అందులో విలీనం కావాలని నిర్ణయించుకోవడమే. ఈ పార్టీకి ఎంపీ, ఎమ్మెల్యేలు గానీ లేరు. కాగా, 2023లో జరిగిన త్రిపుర శాసనసభ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా బరిలోకి దిగింది. పార్టీ ఫిరాయింపులు చేసే వారిని తిరస్కరించాలన్న నినాదంతో ఆ పార్టీ ఎన్నికల ప్రచారం చేసింది. పోటీ చేసిన మూడు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అధ్యక్షుడిగా బంగాల్‌కు చెందిన ఉట్టియ కుందు ప్రస్తుతం సేవలందిస్తున్నారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు చేసిన ప్రతిపాదనకు స్పీకర్ ఓంబిర్లా ఆమోదముద్ర వేస్తే లోక్‌సభలో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఐదో పెద్ద పార్టీగా నిలుస్తుంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ తొమ్మిదో స్థానానికి పడిపోతుంది.

# జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్



పేపర్ల లీకేజీ, పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోదీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జూన్ 21న జరగనున్న నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్?కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఆయన ఎక్స్ వేదికగా తప్పుపట్టారు. "నీట్ రీ-టెస్ట్ కోసం మోదీ సర్కార్ టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసింది. కానీ కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన తమ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని రాజీనామాను ప్రధాని మోదీ కోరాలి. దేశంలోని చైతన్యవంతులైన యువత కేవలం ఒక్కటే డిమాండ్ చేస్తున్నారు. అదే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ఇది జవాబుదారీతనానికి మొదటి పరీక్షగా మారింది. దురదృష్టవశాత్తు బీజేపీ ఈ పరీక్షలో పూర్తిగా విఫలమైంది."

**మాఫియాను రక్షించే ప్రయత్నం!**

"భారత వైమానిక దళాన్ని రంగంలోకి దించడం, టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం లేదా పేపర్ లీక్? మాఫియాను రక్షించేందుకు చిన్న చేపలను పట్టుకోవడం- ఇవన్నీ మోదీ ప్రభుత్వం చేయాల్సి వస్తోంది. ఎందుకంటే గత 10 ఏళ్లలో 90 పేపర్ లీక్‌లు జరిగాయి. ఈ మోసం, అవినీతి వల్ల 9 కోట్ల మంది యువత నష్టపోతున్నారు. ఈ ప్రభుత్వం తన వైఫల్యాలను ఇంకెంత కాలం కప్పిపుచ్చుకుంటుంది" అని ఖర్గే ప్రశ్నించారు. పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల దాదాపు అరడజను మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. "మోదీ ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. తమ పిల్లలను రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు భారీగా అప్పులు చేసిన ఎంతో మంది తల్లిదండ్రులు ఉన్నారు. తీరా చూస్తే, ఒకదాని తర్వాత ఒకటిగా నీట్, ఎస్ఎస్‌సీ, యూజీసీ-నెట్, సీయూఈటీ, ఇతర పరీక్షల పేపర్లు లీక్ అవుతున్నాయి" అని ఖర్గే విమర్శించారు. "పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటే, సీబీఎస్?ఈ ఫలితాల్లో ఎంత మోసం జరిగిందంటే, ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ ప్రభుత్వ తీరును బట్టబయలు చేశారు. ఇక ఇప్పుడు అత్యంత విశ్వసనీయతకు చిహ్నంగా భావించే యూపీఎస్?సీ పరీక్ష కూడా ఆరోపణల పరిధిలోకి వచ్చింది" అని ఖర్గే ఆరోపించారు.

**రాహుల్ గాంధీ విద్యార్థి సదస్సులు**

పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తోంది. మరోవైపు ఈ విషయంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి లోకాన్ని ఏకం చేసే ప్రయత్నాల్లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జూన్ 17 నుంచి రాజస్థాన్?లోని కోటా నుంచి దేశవ్యాప్తంగా విద్యార్థి సదస్సులు నిర్వహించనున్నారు.

**ప్రతి ఒక్కరూ విద్యార్థులకు అండగా నిలవాలి: ప్రియాంక గాంధీ**

పేపర్ లీకేజ్, పరీక్షల అక్రమాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తన సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు విద్యార్థులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను, ఆవేదనను అర్థం చేసుకోవాలని ఆమె అన్నారు.

"ప్రజా బాధ్యత కలిగిన మనమందరం విద్యార్థులకు అండగా నిలబడాలి. వారు ఎలాంటి ఇబ్బందులు, బాధలు అనుభవిస్తున్నారో అర్థం చేసుకోవాలి. ఇక్కడ ప్రతి పేపరూ లీక్? అవుతోంది. వారి తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. ఈ సమస్య ఏదో ఒక చోట, ఒకరికి మాత్రమే జరిగింది కాదు. ఇది తక్షణం పరిష్కరించాల్సిన ఒక లోతైన వ్యవస్థాగత సమస్య. మనం కచ్చితంగా మార్పు తీసుకురావాలి." విద్యార్థుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడానికి, పదేపదే జరుగుతున్న పరీక్షల అక్రమాలు, లీకేజీల వల్ల వారి తల్లిదండ్రుల కష్టార్జితం వృథా కాకుండా చూడడానికి పరీక్షల విధానంలో సమగ్ర మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రియాంక గాంధీ నొక్కిచెప్పారు.

# నీట్ రీ-ఎగ్జామ్ పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు



నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్‌కు సమయం దగ్గరపడుతున్న తరుణంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అలర్ట్ జారీ చేసింది. ప్రశ్నా పత్రాల లీకేజీ వదంతులను నమ్మవద్దని విద్యార్థులను సూచించింది. అలాగే, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను కోరింది. నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే, మోసపూరిత ప్రచారాలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్‌టీఏ ఒక ప్రత్యేకమైన ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎవరైనా ఎగ్జామ్ ప్రశ్నాపత్రాలు ఇస్తామని డబ్బులు అడిగినా, లేదా లీక్ అయిందని తప్పుడు ప్రచారం చేసినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. అటువంటి మోసగాళ్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌టీఏ హెచ్చరించింది.

**ఆన్‌లైన్ మోసాలపై నిఘా**

ఇదిలా ఉండగా, నీట్ రీ ఎగ్జామ్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు అధికారులు అన్ని రకాలు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఆన్‌లైన్ మోసాలపై పర్యవేక్షణను కఠినతరం చేశారు. నీట్ పరీక్షా పత్రాలు తమ వద్ద ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తూ, అభ్యర్థులను మోసం చేయడానికి కొన్ని మోసపూరిత ముఠాలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రయత్నిస్తున్నాయని ఎన్‌టీఏ తెలిపింది. అయితే, పరీక్షకు ముందే ప్రశ్నపత్రం ఎవరికీ అందుబాటులో ఉండదని, పేపర్ తయారీ, నిల్వ, రవాణా వంటి ప్రక్రియల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

**అందుబాటులో అడ్మిట్ కార్డులు**

ఇక, నీట్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది. వెబ్‌సైట్ ప్రారంభమైన మొదటి 24 గంటల్లోనే 10 లక్షల మందికి పైగా అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారని ఎన్‌టీఏ పేర్కొంది. కొన్నిచోట్ల డౌన్‌లోడ్ లింక్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిసింది. అయితే, సాంకేతిక సమస్యలు, సర్వర్‌పై అధిక భారం కారణంగానే ఈ సమస్య తలెత్తిన్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. సమస్యలను పరిష్కరించే దిశగా తమ బృందం పనిచేస్తుందని పేర్కొంది.

మరోవైపు, రీఫండ్ విషయంలోనూ అభ్యర్థులకు ఎన్?టీఏ పలు సూచనలు చేసింది. అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే ముందు, తమ బ్యాంక్ ఖాతా వివరాలను సరిచూసుకోవాలని అభ్యర్థులకు సూచించింది. కాగా, దేశవ్యాప్తంగా జూన్ 21న నీట్ రీ ఎగ్జామ్ జరగనుంది. దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు.

**15 నిమిషాల పొడగింపు**

ఇక, పరీక్ష నియమావళిలో ఎన్?టీఏ కొన్ని మార్పులు చేసింది. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా సమయాన్ని మరో 15 నిమిషాలు పొడగిస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. పరీక్ష ప్రారంభానికి ముందు, తర్వాత ఇన్విజిలేషన్? ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 15 నిమిషాల వరకు పరీక్ష జరగనున్నట్లు పేర్కొంది. అయితే, అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ పేర్కొంది. వీటితోపాటు ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్‌కోసం కేటాయించిన పేజీల సంఖ్యను, రెండు నుంచి నాలుగుకు పెంచినట్లు తెలిపింది. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రశ్నాపత్రం మొదట్లో, చివర్లో రెండేసి రఫ్ పేపర్లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

**టెలిగ్రామ్‌పై ఆంక్షలు**

మరోవైపు, ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్టవేయాలనే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో టెలిగ్రామ్ యాక్సెస్‌ను జూన్ 22 వరకు తాత్కాలికంగా ఆంక్షలు విధించినట్లు పేర్కొంది. ఎన్‌టీఏ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, నీట్ రీ ఎగ్జామ్?కు ముందు తప్పుడు ప్రచారాలు, వ్యవస్థీకృత మోసాల నెట్‌వర్క్‌లను నిరోధించడానికి ఈ చర్య తీసుకున్నట్లు ఏజెన్సీ తెలిపింది.

## ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ జారీ చేసే ఆధార్ కార్డులను పౌరసత్వం, స్థానికత, నివాస చిరునామా రుజువులుగా ఉపయోగిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందనను కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం, అడ్వకేట్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ పిటిషన్‌ను ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఇలాంటి ఇతర కేసులతో జత చేసింది. ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా ఉపయోగించేలా పరిమితం చేయాలని పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ కోరారు. దీనిని పౌరసత్వం, స్థానికత, చిరునామా, పుట్టిన తేదీకి రుజువుగా వాడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఎన్నికల సంఘానికి కూడా తగిన ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కోరారు. న్యాయవాది అశ్వినీ దూబే ద్వారా ఈ పిటిషన్?ను సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేశారు. కొత్త ఓటరు నమోదు కోసం దరఖాస్తు ఫారమ్‌లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా ఆధార్‌ను ఉపయోగించడానికి పిటిషనర్ సవాల్ చేశారు. ఇది ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్? 9, ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ)- 1950లోని సెక్షన్? 23(4), రాజ్యాంగంలోని ఆర్టికల్? 14కు విరుద్ధమని పేర్కొన్నారు.

**అక్రమ చొరబాటుదారులకు వరంగా మారింది!**

"ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 చాలా స్పష్టంగా ఆధార్ అనేది పౌరసత్వం లేదా స్థానికతకు రుజువు కాదు అని చెబుతోంది. అలాగే 2023 ఆగస్టు 22 నాటి యూఐడీఏఐ నోటిఫికేషన్ కూడా ఆధార్ అనేది గుర్తింపునకు మాత్రమే రుజువు, పౌరసత్వం, చిరునామా, పుట్టిన తేదీకి కాదు అని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ పాఠశాల ప్రవేశాలు, ఆస్తి కొనుగోళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల కోసం వయస్సు, పౌరసత్వం, స్థానికత రుజువుగా ఆధార్‌ను ఉపయోగిస్తున్నారు. అంతేకాదు కొత్త ఓటరు నమోదు దరఖాస్తు ఫారమ్ (ఫారమ్-6)లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా కూడా వాడుతున్నారు. దీని వల్ల చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్?ను ఉపయోగించి వివిధ రకాల అధికార పత్రాలు పొందుతున్నారు" అని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫారమ్-6 కింద చేస్తున్న వెరిఫికేషన్ విధానం చాలా లోపభూయిష్టంగా ఉందని, సరైన పత్రాలు లేని వ్యక్తులు కూడా ఓటర్ల డేటాబేస్?లో చేరిపోయే ప్రమాదం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. అందుకే ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే వెరిఫికేషన్ విధానాన్ని సమూలంగా పునర్వ్యవస్థీకరించాలని ఆయన కోరారు. ఈ సంస్కరణలను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో పాటు, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన హై-పవర్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**విదేశీయులు కూడా ఆధార్ పొందవచ్చు!**

ఆధార్ చట్టం ప్రకారం, విదేశీ పౌరులతో సహా దేశంలోని నివాసితులు అందరూ ఆధార్ కార్డు పొందే హక్కు ఉందని పిటిషనర్ అన్నారు. ఓ వ్యక్తి ఒక ఏడాదిలో 182 రోజులు భారతదేశంలో నివసిస్తే, ఆధార్ కార్డు పొందడానికి అర్హత వచ్చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అద్దె ఒప్పందాలు, స్థానిక అధికారుల సిఫారసులు వంటి పత్రాల ఆధారంగా ఎన్‌రోల్మెంట్ కేంద్రాల నుంచి ఆధార్ పొందవచ్చని తెలిపారు. అందుకే ఈ లూప్? హోల్స్‌ను ఆసరాగా చేసుకొని అక్రమ వలసదారులు, చొరబాటుదారులు ఆధార్?ను సంపాదిస్తున్నారని, ఆ తర్వాత దానిని ఉపయోగించి ఓటరు గుర్తింపు కార్డుతో సహా ఇతర గుర్తింపు పత్రాలను కూడా సులభంగా పొందగలుగుతున్నారని తన పిటిషన్?లో పేర్కొన్నారు. కనుక ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 23(4) ప్రకారం, ఆధార్?ను కేవలం గుర్తింపును నిరూపించుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని, వయస్సు, నివాసానికి రుజువుగా వాడకూడదని పిటిషనర్ పేర్కొన్నారు. ఆధార్ ఉపయోగించి దేశంలోకి చొరబడుతున్న అక్రమ వలసదారుల వల్ల ఎన్నికల్లో పారదర్శకత లేకుండా పోతోందని అన్నారు. జనాభా మార్పులు (డెమోగ్రాఫిక్ ఛేంజ్) వస్తున్నాయని, దేశ భద్రతకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం. ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హార్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## టెలిగ్రామ్‌పై కేంద్రం కీలక నిర్ణయం నీట్ పరీక్ష అయ్యే వరకు బ్యాన్

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్?కు ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రం లీక్‌ల పేరుతో జరుగుతున్న మోసాలు, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. 2026 జూన్ 22 వరకు దేశంలో టెలిగ్రామ్ సేవల పరిమితం చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చేసిన సిఫార్సుల మేరకు, సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 69ఏ కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామ్? రోజుతో పాటు ఆ తర్వాతి రోజు వరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయి. పరీక్షలు రాసే విద్యార్థులను మోసం చేస్తున్న గ్రూపులు టెలిగ్రామ్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయని, అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. అయితే టెలిగ్రామ్‌లో ఇప్పటికే పంపిన సందేశాలను తర్వాత సవరించే సదుపాయాన్ని కూడా జూన్ 30 వరకు భారతదేశంలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పరీక్ష ముగిసిన తర్వాత అసలు ప్రశ్నాపత్రాలను పాత సందేశాల్లో జతచేసి, అవి ముందుగానే లీక్ అయ్యాయని తప్పుడు ఆధారాలు సృష్టించే ఘటనలు ఇటీవల పెరిగినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు నిర్వాహకులు పరీక్ష అనంతరం అసలు ప్రశ్నాపత్రాన్ని పాత పోస్టుల్లో జతచేసి, వాటి స్క్రీన్‌షాట్లను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపింది. టెలిగ్రామ్‌ను విద్య, ఉద్యోగ, వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించే లక్షలాది మంది వినియోగదారులకు ఈ నిర్ణయం కొంత అసౌకర్యం కలిగించవచ్చని ఎన్‌టీఏ అంగీకరించింది. అయితే పరీక్షల పారదర్శకత, భద్రత కోసం ఈ చర్యలు తప్పనిసరి అయ్యాయని తెలిపింది.

**జూన్ 21న రీ-ఎగ్జామ్**

దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆ పరీక్షను రద్దు చేశారు. దీంతో లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. ఈ నేపథ్యంలో జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు వార్తలు వచ్చాయి. అయినా సరే రీటెస్ట్ పేపర్ కూడా లీక్ అయిందంటూ వదంతులు వ్యాపించాయి. వాటిని ఇప్పటికే ఎన్‌టీఏ ఖండించింది. నీట్ రీ-ఎగ్జామ్? నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే జూన్ 21న జరుగుతుందని స్పష్టం చేసింది. పరీక్షకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక ఎన్‌టీఏ ప్రకటనలు, వెబ్‌సైట్‌ను మాత్రమే నమ్మాలని సూచించింది. ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న తప్పుడు సమాచారాన్ని, పేపర్ లీక్ ప్రకటనలను పూర్తిగా విస్మరించాలని కోరింది.

సంచలనం
బుధవారం
17 జూన్ 2026

# హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు

-మొదటిపేజీ తరువాయి

పని చేశామని, ఇప్పుడూ పని చేస్తామని, తెలంగాణకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశానని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దిల్లీకు వచ్చి రెండుసార్లు ధర్నా చేశామని గుర్తు చేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని గుర్తు చేశారు.

### ప్రధాని చేతుల మీదుగా ఫేజ్–2 ప్రారంభించాం

తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితే రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టలేదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్–2 కోసం కేసీఆర్ సహకరించకలేదని ఆరోపించారు. కేసీఆర్ సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ఫేజ్–2 ప్రారంభించామన్నారు. తెలంగాణకు రాదనుకున్న రైల్వే ఫ్యాక్టరీని సాధించామని, ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించింది : మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు



రాజకీయాలేనని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్లు వడ్డీ లేకుండా ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్‌సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.

### ప్రాజెక్టులకు సహకరిస్తాం

ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందని, ప్రాజెక్టులు ఆపే సంస్కృతి బీజేపీకి లేదని అది కాంగ్రెస్‌కే ఉండవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. డొంకదారిన ప్రాజెక్టులు అడ్డుకోవాల్సిన కర్మ తమకు లేదని, రేవంత్ రెడ్డి కోసమో, మరెవరి కోసమో ప్రాజెక్టులు అడ్డుకోమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రాజెక్టులకు సహకరిస్తామని స్పష్టం చేశారు.

"మెట్రో ఫేజ్ 2 మరింత వేగవంతానికి నేను సీఎంకు లేఖలు రాశా. ఐఆర్ఎఫ్‌సీతో ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు తీసుకునేందుకు కేంద్రం సహకరించింది. రుణ ఒప్పందం విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. మెట్రో–1 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రుణం తీసుకుంటోంది. రుణం విషయమై రాష్ట్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ మధ్య ఒప్పందం జరిగింది. టికెట్లు, యాడ్ ఆదాయాన్ని ముందుగా అప్పు చెల్లించాలని ఒప్పందం జరిగింది. ఈ విషయమై కేంద్ర సూచనలకు సీఎం అంగీకరించట్లేదని చెప్పారు. అన్ని మెట్రోలు తీసుకున్న రుణాలు వాటికే ముందుగా చెల్లించరు. రెగ్యులర్ మెట్రో ఆపరేషన్, నిర్వహణకు ముందుగా వచ్చిన ఆదాయం చెల్లించాలి. ఆ తర్వాతే రుణాలకు సంబంధించి మిగతా డబ్బులు చెల్లించాలి" – కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

# తెలంగాణలో విచారణల పాలిటిక్స్

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో, వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం? ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట.ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కేలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు. అంతేకాదు..




సింగరేణి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు.కేసీఆర్ సర్కారు కేంద్రంగా ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నాయి. అంతేకాదు.. ఒకరిపై ఒకరు మీరు విచారణ చేపట్టాలంటే మీరు విచారణ చేపట్టాలని నిలదీతలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వెనుక వీటిని రాజకీయ వస్తువులుగానే వినియోగించుకునే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.కాగా.. ప్రస్తుతం కిషన్ రెడ్డి లేవనెత్తిన సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం కూడా రాజకీయపరమైన అంశంగానే కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. బొగ్గుగని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. గనుల నిల్వలు.. సరుకు రవాణా.. కేటాయింపు ఇలా.. అన్ని విషయాలు బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి పరిధిలోనే ఉంటాయి. కాబట్టి.. ఈ రచ్చ ఇలా కొనసాగుతుందా.. లేక పరిష్కారం లభిస్తుందా? అనేది చూడాలి.

# సింగూరు డ్యామ్‌కు డేంజర్ బెల్స్

**మెదక్ :** ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసా య రంగానికి వెన్నెముకగా, హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే ప్రధాన వనరుగా ఉన్న సింగూరు మల్టీపర్పస్ ప్రాజెక్టు (మంజీరా నది) ప్రస్తుతం అత్యంత కీలకమై న దశను ఎదుర్కొంటోంది. ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు సాగుతున్నాయి.అయితే సింగూరు ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పనుల మందగమనంపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్‌డీఎస్ఏ ఉన్నతాధికారుల తనిఖీల్లో కూడా స్పష్టమైంది. మార్చిలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఉన్నత స్థాయి నిపుణుల బృందం సింగూరు ప్రాజెక్టును నేరుగా సందర్శించి, సాగుతున్న పనులను పరిశీలించింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై వారు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటే, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కేవలం ఒక్క జేసీబీ, ఒక ట్రక్కును మాత్రమే ఉపయోగించి పనులు చేయడంపై అధికారులు తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలిసింది. రిజర్వాయర్ ఎర్త్ డ్యాం లోపలి భాగంలో ఎక్కడైతే రివిట్‌మెంట్ తీవ్రంగా దెబ్బతిని బుంగలు పడ్డాయో, అక్కడ మొదట పనులు ప్రారంభించాల్సింది పోయి.. డ్యాంకు ఒక చివర నుంచి సాధారణ పద్ధతిలో పనులు చేపట్టడంపై నిపుణులు తప్పుపట్టారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతోనే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో కాకుండా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, రివిట్‌మెంట్‌లో ఏర్పడిన బుంగలు, లీకేజీల కారణంగా రక్షణ చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మరమ్మతు పనుల కోసం నీటి నిల్వను గతంలో 8 టీఎంసీలకు తగ్గించగా, వేసవి అవసరాల తర్వాత ప్రస్తుతం అది మరింత పరిమితమయ్యే అవకాశం ఉంది.ఈ వానాకాలంలో కర్ణాటక, మహారాష్ట్ర క్యాచ్‌మెంట్ ఏరియాల



నుంచి భారీగా వరద నీరు వచ్చినా.. రక్షణ దృష్ట్యా 15 టీఎంసీలకు మించి నిల్వ చేయకుండా మిగిలిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలాలని నిర్ణయించారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్పీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రాజెక్టు ఆధునికీకరణ, గేట్లు, హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. అలల తాకిడికి దెబ్బతిన్న రిజర్వాయర్ లోపలి భాగంలోని పాత రివిట్‌మెంట్లు తొలగించి, రాళ్లతో కొత్తగా పటిష్టమైన నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ వంటి పశ్చిమ ప్రాంతాలకు సింగూరే ప్రధాన తాగునీటి వనరు. వేసవిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, హైదరాబాద్ జలమండలి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించింది. ఈ సీజన్‌లో నిల్వ చేయబోయే 15 టీఎంసీల నీరు జంట నగరాల తాగునీటి అవసరాలకు (ఏడాదికి దాదాపు 4 టీఎంసీలు అవసరం), పరిశ్రమలకు పూర్తిగా సరిపోతుంది. దీంతో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని అధికారవర్గాలు చెపుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులపై వివరణ కోరేందుకు ఇరిగేషన్ శాఖ డీఈని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.వానాకాలం సీజన్ ముంచుకొస్తున్న వేళ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మరింత ఆలస్యమైతే సాగు, తాగునీటి సరఫరాపై ప్రభావం పడనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తున్నప్పటికీ సుమారు 80వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకే పరిమితం చేస్తున్నందున, వానాకాలం సాగునీటి విడుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ భావిస్తోంది. అయితే పూర్తి నిల్వ లేకపోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగడంతో వానాకాలం సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. పనులు పూర్తి కాకపోతే ఈ వానాకాలం వరదలు వచ్చినా రక్షణ దృష్ట్యా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచగలుగుతారు.మిగిలిన నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తుంది. ఎన్‌డీఎస్ఏ హెచ్చరికలు, ప్రభుత్వం నుండి వచ్చిన ఒత్తిడితో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రస్తుతం కాంట్రాక్టర్‌పై నిఘా పెంచారు. యంత్రాల సంఖ్యను, కూలీల సంఖ్యను పెంచి వర్షాకాలం ఉధృతి పెరగక ముందే ప్రధాన పనులను ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. సింగూరు ప్రాజెక్టుపై కొన్ని చోట్ల జరుగుతున్న పనుల నాణ్యత ఎన్‌డీఎస్ఏ ప్రమాణాలమేరకు చేపట్టడంలేదని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ విషయంలో రాజీ పడబోమని, కాంట్రాక్టర్లు ఒకే సీజన్ లోపల పనులన్నీ పూర్తిచేయాలని కఠినంగా ఆదేశించారు.పనులను వేగవంతం చేయకపోతే క్రాప్ హాలిడే (పంటల విరామం) ప్రకటించాల్సి వస్తుందని, అది రైతులకు నష్టం కలిగిస్తుందని కాంట్రాక్టర్‌ను, స్థానిక ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. నీటి అడుగున ఎక్కడైనా పగుళ్లు లేదా లీకేజీలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సోనార్ పరీక్షలు, అండర్ వాటర్ సర్వేలు త్వరితగతిన నిర్వహించాలని మంత్రి సూచించారు.

## సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, ఎరువులపై వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం తెలిపారు.

### రైతుల వివరాల నమోదు

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని సీఎం అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో రానున్న వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సూచనలను సమీక్షించారు. వచ్చే సీజన్ కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు.

### అందుబాటులో 7 రకాల సన్న వడ్ల విత్తనాలు

కనీస మద్దతు ధరలు కేంద్రం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు.

### సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం

వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని చెప్పారు.

### రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ

ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రైతు వేదికలను పూర్తిగా రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

### ప్రభుత్వ డైరీ మరింత బలోపేతం

గతంలో రూ.13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల దిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు.

## "తెలంగాణకు ఊపిరితిత్తులు ఈ రెండు జిల్లాలే"

-మొదటిపేజీ తరువాయి

జిల్లాలు గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోనివే.

### ఈ అటవీ ప్రాంతం ఆందోళన కలిగిస్తోంది

హైదరాబాద్ వంటి నగరాల్లో ఆధునిక జీవన విధానం, జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ వల్ల ఎక్కువగా అడవులు క్షీణించిపోతున్నాయి. వాటిని పూర్తిగా లేకుండా చేస్తున్నారు. రాజధాని హైదరాబాద్? భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 0.08 శాతం మాత్రమే అటవీ ప్రాంతంగా ఉంది. కరీంనగర్ పరిస్థితి మరింత ఘోరం. ఇక్కడ అటవీ విస్తీర్ణం 0.15 శాతం అంటే ప్రతి వెయ్యి ఎకరాల భూభాగంలో 1.5 ఎకరం మాత్రం అటవీ ప్రాంతం ఉంది. కరీంనగర్?లో అటవీ ప్రాంతం ఎంతలా దౌర్భాగ్య స్థితిలో ఉందో అంచనా వేసుకోవచ్చు. రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణం 1,12,122 చ.కి.మీ. ఉంది. ఇందులో అటవీ ప్రాంతం 27,688 చ.కి.మీ. ఉంది. అటవీ విస్తీర్ణం అత్యధికంగా ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం 4,311.38 చ.కి.మీ ఉంటుంది. అత్యల్పంగా ఉన్న జిల్లా హైదరాబాద్? 1.45 చ.కి.మీ. ఉంది.

### అడవులు లేకపోవడం వల్ల కలిగే నష్టాలు

అడవులు ప్రతి రాష్టంలో ఉండాల్సినంత విస్తీర్ణంల ఉండాలి. లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనవల్సి ఉంటుంది. వర్షపాతం సరిగ్గా ఉండదు. వానలు కురవక, పంటలు పండక ప్రజలు కరవుతో అల్లాడిపోతారు. పశుపక్ష్యాదులకు ఆధారం ఉండదు. భూగర్భజలాలు ఎండిపోతాయి. దీంతో వాతావరణం సమతుల్యతను కోల్పోతుంది. ఎండ తీవ్రత పెరిగిపోతుంది. చల్లదనం బాగా తగ్గిపోతుంది. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. జంతువులన్నీ మనుషులు ఉండే ప్రదేశాలకు వస్తాయి. ప్రజలు భయంకర జంతువులతో భిక్కుభిక్కుమంటూ బతకాల్సి వస్తుంది. అందువల్ల చెట్లని పెంచడం, అడవి సంపదను రక్షించడం ఎంతో అవసరం.

## తెలంగాణలో ఏసీబీ మరో రైడ్

-మొదటిపేజీ తరువాయి



ఆస్తులు కూడబెట్టిన అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో ఏకంగా రూ.1.54 కోట్లు, కిలో బంగారంతో పాటు కీలకమైన ల్యాండ్ డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మట్నత్తం 11 చోట్ల ఆరుగురు డీఎస్పీలు 20 మంది ఇన్‌స్పెక్టర్లతో సోదాలు నిర్వహించారు. అత్తాపూర్, మియాపూర్, గచ్చిబౌలి లాంటి ఖరీదైన ప్రాంతాల్లో బినామీ పేర్లపై ఉన్న ఓపెన్ ప్లాట్లు, విల్లాలతో పాటు, రంగారెడ్డి జిల్లాలో భారీగా వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ప్రస్తుతానికి ఈ సోదాల్లో దొరికిన నగదు, నగలు, డాక్యుమెంట్ల ప్రభుత్వ విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని, బహిరంగ మార్కెట్లో వీటి విలువ 200 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. సోదాలు చేశామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. "నరహరి ఇంట్లో రూ.1.40 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నాం. ఇంత భారీ నగదు ఏసీబీ దాడుల్లో ఎప్పుడూ దొరకలేదు. నరహరి ఇంట్లో కిలో బంగారం, భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నాం. మొత్తం 11 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. నగలు, ఆస్తుల విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుంది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, విల్లాల పత్రాలు స్వాధీనం. లాకర్లు తెరిచేందుకు బ్యాంకు అధికారులకు లేఖ రాశాం. సోదాలు పూర్తయ్యాక నరహరిని సాయంత్రం అరెస్టు చేస్తాం" ఇటీవలి కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం ఏసీబీ చరిత్రలోనే సంచలనంగా మారింది. గతంలో జలమండలి జనరల్ మేనేజర్ ఇంట్లో కోటీ పది లక్షల రూపాయలు, రెండు కిలోల బంగారం పట్టుబడగా ఆర్ అడ్ బీ ఈఎన్?సీ మోహన్ నాయక్ ఇంట్లో 65 లక్షల నగదు బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. అయితే వాటన్నింటినీ మించి ప్రస్తుతం నరహరి ఇంట్లో ఏకంగా 1.54 కోట్ల నగదు దొరకడం సంచలనం సృష్టిస్తోంది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనకు వచ్చిన చట్టబద్ధమైన ఆదాయం కూడబెట్టిన స్థిరాస్తుల విలువలపై అధికారులు పక్కాగా లెక్కగడుతున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతుండటంతో ఈ అవినీతి తిమింగలం అక్రమాస్తుల చిట్టా మరింత పెరిగే అవకాశం ఉంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

# కేసీఆర్ వి స్కీంలు.. రేవంత్ వి స్కాంలు..

## రైతులు, పేదలంటే రేవంత్ కి మనస్సు లేదన్న హరీష్ రావు

**కమీషన్ల పనులే రేవంత్ చేపడుతున్నాడు**

**మంత్రులు పొన్నం, అడ్లూరికి వారి శాఖల్లో ఏం జరుగుతుందో తెలియదు..**

**తెలంగాణ బాగుండాలంటే కేసీఆర్ మళ్లీ గెలువాలి**



**తిమ్మాపూర్ :** తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడ్డాక కేసీఆర్ హయాంలో స్కీంలు చేపడితే కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాంలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు తో పాటు సర్ పై విస్తృత స్థాయి సన్నాహాక సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావుకు అల్గునూర్ లో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... మేనిఫెస్టోలో చెప్పని కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మీ లాంటి స్కీంలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తే... సివిల్ సప్లైలో, సింగరేణిలో, హామ్ రోడ్లలో, పిల్లలకు అన్నం పెట్టే గుడ్లలో, బట్టలలో స్కాంలు రేవంత్ సర్కాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న రేవంత్ కుటుంబం కోటీశ్వరులు అవుతున్నారని విమర్శించారు.

జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండా స్కాంలు జరుగుతున్నాయని, జిల్లా పరువు పోతుందని, రూ.2వేల కోట్ల స్కాం జరిగినా వారికి తెలియలేదని, ఇందులో ఎనుమల వారిదే రాజ్యం నడుస్తోందన్నారు. పతకాల అమలుకు ఖజానా లేదంటున్న రేవంత్ ఫుట్ బాల్ ఆటకి, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, పలుచోట్ల క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, ఆయనకు రైతులు, మహిళల పట్ల, పేదల పట్ల మనస్సు లేదని విమర్శించారు. మన సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలకు, ఎన్నికలకు, ఢిల్లీకి పంపిస్తున్నాడని ఆరోపించారు. కమీషన్లు రావని పేదల పథకాలు అమలు చేయడం లేదని, కమీషన్లు వచ్చే పనులను రేవంత్ చేపడుతున్నాడని విమర్శించారు. ఓట్లు పెట్టి దేవుణ్ణి మోసం చేసిన ఎగువేతల రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను. మోసం చేస్తున్నాడని అన్నారు.

ఎగవేతల రేవంత్ అంటే తనపై తిమ్మాపూర్ స్టేషన్ లో కేసు పెట్టినారని, ఇటీవల నోటీసులు ఇచ్చారని, ఆయన ఎగవేతల రేవంత్ అని మరోసారి అన్నారు. రైతు బంధు రూ.19వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంభాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. వద్దుకొనే తెలివిలేని రేవంత్ బీఆర్ఎస్ ని మొలకెత్తనివ్వనని అంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ పరిస్థితి ఆయనకు అర్థమైందని, ఆయన పని అయిపోయినందునే అధికారులు ఆయన మాట వినడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ఉద్యమం చేసినారని, 2001లో అన్నీ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను గెలుపొందిన నియోజకవర్గములో కరుడుగట్టిన కార్యకర్తలున్నారని అన్నారు.

**డిస్కం బూతం రాబోతుంది...**

కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదకొండు గంటలకు తగ్గిందని, రైతు డిస్కంను ప్రవేశపెట్టి ఆరు ఏడు గంటలకే కుదించనున్నారని తెలిపారు. రైతు డిస్కం పేరిట సోలార్, విండ్ పవర్ ఇచ్చేలా చూస్తున్నారని, రాత్రి పూట కరెంటు ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతుల ఉసురు తీసేందుకు రైతు డిస్కంలను తీసుకురానున్నారని ఆరోపించారు. ఇలాంటి రేవంత్ కి రైతులు ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రైతులు సైతం కేసీఆర్ ని గుర్తు చేస్తున్నారని, రేవంత్ కి ఓటు వేసేందుకు సిద్దంగా లేరని అన్నారు.

**రీఎంబర్స్ మెంట్..**

రీఎంబర్స్ మెంట్ ని నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. బలహీన వర్గాల పిల్లలంటే రేవంత్ కి ఇష్టం లేదన్నారు. ఇప్పటి వరకు సీఎం, మంత్రులు రీ ఎంబర్స్ మెంట్ విషయం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నత విద్యకు 30లక్షల మంది విద్యార్థులు దూరమై ఒక తరం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్న రేవంత్ సర్కారు పేద విద్యార్థులకు ఇవ్వడానికి మనస్సు రావడం లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన రేవంత్ కేవంల 16వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు.

**రిజర్వార్ల ఘనత మాదే...**

తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సస్యశ్యామం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, 23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందంచినట్లు తెలిపారు. ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు పూర్తి చేసినట్లు, పిల్ల కాలువలు అక్కడక్కడా పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు.

**మన ఓట్లు జాగ్రత్త...**

ప్రతీ 20 ఏళ్లకోసారి ఓటరు జాబితా సవరణ (సర్) ని ఎన్నికల కమీషన్ చేపడుతుందని, దీనిపై బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విచారణ సమయంలో అధికారుల వెంట బీఆర్ఎస్ బూత్ ఇంచార్జీలు ఉండాలని సూచించారు. రివిజన్ సమయంలో ఇతర పార్టీల వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా గమనించాలని తెలిపారు. మన ఓట్లు పోకుండా చూసుకోవాలని, రివిజన్ విషయంలో ఓట్లు కోల్పోతే అప్పీలు చేసుకునే అవకాశం ఉందని, అప్పీలు ద్వారా ఓటు హక్కు తెచ్చుకోవచ్చన్నారు. ఈ సమావేశమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, ఇంచార్జీ రవీంధర్ రావు, కార్పోరేటర్ కాల్వ మల్లేశం, నాయకులు రవీందర్ సింగ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, చల్ల హరిశంకర్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, సిద్దం వేణు, శేఖర్ గౌడ్, స్వామిరెడ్డి, ఏకానందం, నాయిని వెంకట రెడ్డి, రవీంధర్ రెడ్డి, వెంకన్న, మహిపాల్, రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో వింత వాతావరణం

## ఓ వైపు ఎండలు... మరో వైపు వానలు

**హైదరాబాద్ :** గాణ ప్రభుత్వం అప్రమత్తం అయింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో సాయంత్రం తరువాత ఒకట్రెండు చోట్ల వర్షం పడే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. ఎల్ నినో ప్రభావంతో జూన్ 15 దాటినా కూడా ఏపీ, తెలంగాణలో భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంకా తెలుగు రాష్ట్రాల్లో ఏసీలు, కూలర్లు వాడుతుండటమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

**19 నుంచి వారం రోజులు భారీ వర్షాలు**

ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరిస్తున్నాయి. బుధవారం, గురువారాల్లో ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. జూన్ 19వ తేదీ నుంచి తెలంగాణవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని, వారం రోజులపాటు ఈ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. జూన్ 1 నుంచి జూన్ 15 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 10 శాతం లోటుతో 49.2 మి.మీ నమోదైందని తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికలతో అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. వరద ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజల ప్రాణాలు, ఆస్తులను



కాపాడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

**ఓవైపు వర్షాలు.. మరోవైపు వడగాల్పులు**

రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు భారీ వర్షాల హెచ్చరికలు ఉన్నప్పటికీ సోమవారం నాడు ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని పలు మండలాల్లో తీవ్రమైన వడగాలులు వీచాయి. ఈ జిల్లాల్లో సాధారణం కంటే 4.6 డిగ్రీల వరకు అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్, మహబూబ్‌నగర్ మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ సాధారణం కంటే 3 డిగ్రీల మేర పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. నేడు (జూన్ 16న) కూడా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పలుచోట్ల వడగాలులు వీచనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాగా, నిన్న గరిష్టంగా వికారాబాద్ జిల్లా రాపోలులో 4.4 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

**ఏపీలో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు.. కొన్నిచోట్ల తీవ్రమైన ఎండలు**

ఆంధ్రప్రదేశ్‌లో ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం వేగంగా మారుతోందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగతాచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాలతో పాటు రాయలసీమ పరిధిలోని చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో పిడుగులు పడే తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది. అంతకుముందు సోమవారం నాడు కూడా ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే.మరోవైపు రాష్ట్రంలో ఎండల ప్రభావం కూడా గట్టిగానే ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో అనవసరంగా బయటకు రాకూడదని, ఒకవేళ అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సి వస్తే చెవుల్లోకి నేరుగా వేడిగాలి వెళ్లకుండా తలకు గుడ్డ కట్టుకోవడం లేదా టోపీలు ధరించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

### తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఎన్నిక

**– సభ్యులుగా బూరుగు వెంకటేశం**



**రామన్నపేట, జూన్ 16(సంచలనం న్యూస్):** మండల కేంద్రానికి చెందిన బూరుగు వెంకటేశం ను తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఈ మేరకు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమ్మోహన్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రామన్నపేట పట్టణానికి చెందిన బూరుగు వెంకటేశం రామన్నపేట పట్టణ, మండల పద్మశాలి సంఘం ఏర్పాటు విషయంలో కీలకంగా వ్యవహరించడంతోపాటు సంఘ బలోపేతానికి సాయశక్తుగా చేస్తున్నట్లు తెలిపారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్న ఆయనను క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియామకం కావడంతో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, డీసీఎంఎస్ మాజీ జిల్లా డైరెక్టర్, రామన్నపేట కాటన్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు జేల్ల వెంకటేష్, పద్మశాలి సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కైరంకొండ నాగభూషణ్, నాయకులు రవ్వ నరసింహ, రవ్వ సత్యనారాయణ, మహేశ్వరం అశోక్, కైరంకొండ నందు, చలమల గోపాల్, హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

### భువనగిరి జిల్లాలో పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలన

**– చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్**






**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 16(సంచలనం న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఐఏఎస్ మంగళవారం పరిశీలించారు. ముందుగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న హరిత హోటల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆమె పరిశీలించారు. సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని ప్రసిద్ధ సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి, ఆ ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై, ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పర్యాటక ఆకర్షణగా మరింత అభివృద్ధి చేసే అవకాశాలపై చర్చించారు. తదుపరి బస్వాపూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి పరిశీలించారు. ప్రకృతి అందాలను వినియోగించుకుని పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అదేవిధంగా భువనగిరి కోట వద్ద ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రోప్‌వే ప్రాజెక్టు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యాటక శాఖ డైరెక్టర్ రంజిత్ నాయక్, ఆర్కియాలజీ డైరెక్టర్ అర్జున్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత తహసీల్దార్లు, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి మరియు జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి చిలుకూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల పరిశీలన

**- చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**






**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 16(సంచలనం న్యూస్):** భువనగిరి పట్టణం లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాగాయత్ పాఠశాలను మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, కొత్తగా ఎన్ని అడ్మిషన్లు నమోదయ్యాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ సర్వే విధానం, విద్యార్థుల అభ్యాస స్థాయిని ఆధారంగా చేసుకొని గ్రేడింగ్ ఎలా ఇస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మూడో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల ఎలా ఉందని, ఏ సబ్జెక్టు అంటే ఎక్కువ ఇష్టమని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో చదివించడం, రాయించడం చేయించి వారి నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. తదుపరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి బయటకు వెళ్లిన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది మరింత ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలలో చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి వాటిని వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులకు ఈ రోజు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిన్న విద్యాధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Publisher & Owner by Reesaanvi Media House, H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Chief Editor: Bathula Ganesh.
H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Regd. No: TS-30-0043998, Email: sanchalanamnewsdesk@gmail.com, Cell: 9177108128